

రేపు హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో రేపు డీపీవో పోస్టు కోసం సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఐఈవో గోవిందరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో సీఈసీ, బైపీసీ, వొకేషనల్, హెచ్ఈసీ గ్రూపులలో 75 శాతం మార్కులున్నవారికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటల వరకు కళాశాల వద్ద హాజరుకావాలని సూచించారు.



భక్తులతో కిక్కిరిసిన మెదక్ సీఎస్ఐ చర్చి ప్రార్థనా మందిరం

మెదక్ సీఎస్ఐ చర్చిలో భక్తుల సందడి

మెదక్, కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ఉదయం శిలువ ఆరాధన, అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఆవరణలో సిలువ వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు. ప్రార్థనల్లో రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ప్రార్థన మందిరం భక్తులతో కిక్కిరిసింది. చర్చి ఆవరణ ఏసు నామస్మరణతో మార్మోగింది.

విస్తరణలో వింతలు!

సంగారెడ్డి బైపాస్ రోడ్డు విస్తరణలో అక్రమాలు

కొన్నిచోట్ల 80 ఫీట్లు.. మరికొన్ని చోట్ల 60 ఫీట్లు

అస్మదీయుల కోసం నిబంధనలకు తిలోదకాలు



కొంత వరకే విస్తరించి వదిలేసిన రోడ్డు





ఇష్టారీతిన చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో చేపట్టిన బైపాస్ రోడ్డు విస్తరణ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని నయిబి నుంచి బసవేశ్వర విగ్రహం వరకు రోడ్డును రూ. 12 కోట్ల వ్యయంతో 80 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. అయితే, హెచ్ఎండీఏ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పనుల్లో పలు చోట్ల 80 అడుగులకు బదులు 60 అడుగుల మేర మాత్రమే విస్తరణ జరుగుతోంది. పలుకుబడి ఉన్నవారి అక్రమ నిర్మాణాలను తొలగించకుండా, చిరు వ్యాపారుల దుకాణాలను మాత్రమే తొలగిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను కూడా తరలించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

సింగూరు ప్రాజెక్టును
టూరిస్ట్ హబ్‌గా మారుస్తాం

మంత్రి దామోదర్ రాజనర్సింహ



సింగూరు బ్యాక్‌వాటర్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాయికోడ్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మారుస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. రాయికోడ్ మండలంలోని ఇందూరు గ్రామ సమీపంలో సింగూరు బ్యాక్‌వాటర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. సింగూరు పరివాహక ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రిసార్ట్‌లను నిర్మిస్తామని తెలిపారు. పర్యాటకులు రాత్రిపూట కూడా బస చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. మునిపల్లి మండలం బుదేరా నుంచి రాయికోడ్ మండలం సిరూర్ వరకు రోడ్డు ఏర్పాటు చేస్తే ఈప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం ఇందూరు గ్రామంలో చిన్న మల్లికార్జున స్వామి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ పాటిల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య, సీనియర్ నాయకులు సిద్దన్నపాటిల్, మల్లికార్జున్‌పాటిల్, సుభాష్‌పాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీ నర్సింహులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విదర్శన్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సతీష్ కులకర్ణి, కేదర్నాథ్ పాటిల్, బస్వరాజ్ పాటిల్, ప్రభాకర్‌చారి, మహంకాళి నర్సింహులు, బాబాగౌడ్, సాదక్ పటేల్, రాజశేఖర్‌గౌడ్, బాసిత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో నేటి నుంచి
ఇంటర్ కాలేజీల్లో ఫేస్ రికగ్నిషన్ హాజరు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం నుంచి ఫేస్ రికగ్నిషన్ హాజరు (ఎఫ్ఆర్ఎస్) పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. ఈ కళాశాలల్లో సుమారు 8 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఈ యాప్ ద్వారా హాజరు తీసుకుంటారని తెలిపారు. ఈ విధానం ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేస్తుందని వివరించారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. విద్యాసంస్థలో ర్యాగింగ్ చేయడం నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే క్రిమినల్ కేసులతో పాటు విద్యాసంస్థల నుంచి తొలగిస్తారని తెలిపారు. భవిష్యత్‌లో విద్యా, ఉద్యోగ అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ప్రతీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిరంతరంగా నిర్వహించాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థులు డయల్ 100, మెదక్ పోలీస్ కంట్రోల్ రూం నంబరు 8712657888కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఒకప్పుడు బంగారు గనిగా భావించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడు వ్యాపారులకు గుదిబండలా మారింది. ఆశించినంత లాభాలు రాకపోవడంతో వేల ఎకరాల భూములు అమ్ముడుపోకుండా నిలిచిపోయాయి. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక వ్యాపారులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. గతంలో ఎకరాకు రూ. 1.20 కోట్లు పలికిన ధర.. ప్రస్తుతం రూ. 80 లక్షలకు పడిపోయినా కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. దీంతో ఎన్నో ఆశలతో పెట్టుబడులు పెట్టిన వ్యాపారులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.



‘రియల్’ ఢాం

పడిపోయిన భూముల ధరలు.. మందకొడిగా క్రయవిక్రయాలు

అమ్ముడుపోక నిలిచిపోయిన వేలాది ఎకరాలు

లాభాల ఆశతో అప్పులు చేసి పెట్టుబడులు

నిండా మునిగిన మెతుకుసీమ వ్యాపారులు

మెదక్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు రియల్ ఎస్టేట్ అంటే బంగారు గనిగా భావించేవారు. ఏ పట్టణంలో అయినా భూములు కొంటే కొద్ది సంవత్సరాల్లోనే రెండు, మూడు రెట్లు లాభం వస్తుందని నమ్మేవారు. ఒకప్పుడు మెదక్ జిల్లాలో వేగంగా పెరిగిన రియల్ వ్యాపారం... ఇప్పుడు వేల ఎకరాల భూములు అమ్ముడుపోక కుదేలయింది. పరిస్థితులు మారిన ఈ తరుణంలో, జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెట్టుబడులు పెట్టిన భూములు అమ్ముడుపోకపోవడంతో అప్పుల ఊబిలో ఇరుక్కుపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా గత ఐదు సంవత్సరాలలో సుమారు 12 వేల ఎకరాలు రియల్ ఎస్టేట్ కోసం కొనుగోలు అయినట్లు ఒక అంచనా. వీటిలో దాదాపు ఏడు వేల ఎకరాలు ఇప్పటికీ అమ్ముడు కాలేదు. తూప్రాన్ మండలంలో హైదరాబాద్-నాగపూర్ హైవే పక్కన ప్రాజెక్టులకు ఊహించినంత డిమాండ్ రాకపోవడంతో అమ్మకాలు నిలిచిపోయాయి. నర్సాపూర్ మండలంలో ఐటీ పార్క్ వస్తుందని ప్రచారం జరగడంతో పెట్టుబడులు పెట్టినా.. ఆ ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడం లేదు. సంగారెడ్డి - మెదక్ మార్గంలో కొల్చారం మండలంలో హైవే విస్తరణ చేపట్టడంతో డిమాండ్ వస్తుందని ఊహించి కొనుగోలు చేసిన భూములు కూడా ఎవరూ కొనడం లేదు. మెదక్ - సిద్దిపేట మార్గంలో హవేళీఘనపూర్, రామాయంపేట, నిజాంపేట, మెదక్ మండలాల్లోనూ భూములకు డిమాండ్ పడిపోయింది. టేక్మాల్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట తదితర రూరల్ మండలాల్లో వందలాది ఎకరాలు అందుబాటులో ఉన్నా కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. మెదక్-చేగుంట, తూప్రాన్-నర్సాపూర్, మెదక్-రామాయంపేట, తూప్రాన్-మనోహరాబాద్, రామాయంపేట-సిద్దిపేట రోడ్డు, నర్సాపూర్-బాలానగర్ మార్గాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలయింది. నగర శివార్లలో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలైన తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోనే 1,800 ఎకరాలు పెట్టుబడిదారుల చేతిలో చిక్కుకుపోయాయి.

ధరలు పడిపోవడమే దెబ్బ

నాలుగేళ్ల క్రితం వరకు రూ.1.20 కోట్లు ఉన్న భూమి ధర ప్రస్తుతం రూ.80 లక్షలకు మించడం లేదు. ఒకప్పుడు వివిధ పట్టణాల్లో గజం స్థలం ధర రూ. 8వేల నుంచి రూ.10వేల వరకూ ఉండగా, ప్రస్తుతం రూ. 5వేల నుంచి రూ. 3వేలకే దొరుకుతున్నాయి. అయినా కొనుగోలుదారులు ముందుకురావడం లేదు. గత ఐదేళ్లలో జిల్లాలో 200 వందల లేఅవుట్లు చేయడగా 25 ప్రాజక్టుల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తయాయి. మిగిలిన ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో 60 శాతం మంది రుణాలపైనే ఆధారపడి పెట్టుబడులు పెట్టారు. ప్రైవేట్ ఫైనాన్సర్ల వద్ద రూ. కోట్లలో అప్పులు తీసుకువచ్చారు. వడ్డీల భారం తట్టుకోలేక కొందరు వ్యాపారులు ఇప్పటికే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త పరిశ్రమలుఐటీ కంపెనీలు, రోడ్ల నెట్‌వర్క్ విస్తరణ ప్రాజెక్టులు వస్తేనే పరిస్థితి మారుతుందని, లేకపోతే మరో మూడు, నాలుగేళ్లు మార్కెట్ పుంజుకునే అవకాశం లేదని నిపుణులు భావిస్తున్నారు.

ఎస్జీటీలకు రేపు
పదోన్నతి ఉత్తర్వులు

- **సంగారెడ్డి జిల్లాలో 190 మందికి అవకాశం**
- **నేడు వెబ్ ఆప్షన్ల నమోదు**

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తి కావడంతో జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జీహెచ్ఎంలుగా పదోన్నతి పొందిన ఎస్ఏలు శుక్రవారమే కొత్త పాఠశాలలో విధుల్లో చేరారు. ఇక ఎస్జీటీల్లో అర్హులైన వారికి ఎస్ఏలుగా పదోన్నతి కల్పించనున్నారు. ఇప్పటికే సీనియారిటీ జాబితాను వెల్లడించిన అధికారులు కూడా అభ్యంతరాలు స్వీకరించారు. ఈ నెల 25న పదోన్నతికి అర్హులైన ఉపాధ్యాయులు నుంచి వెబ్ ఆప్షన్లు తీసుకోనున్నారు. వెబ్ ఆప్షన్ల ఆధారంగా 26 న పదోన్నతి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో 248 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 70 శాతం పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తున్నారు. మిగిలిన 30 శాతం పోస్టులను డీఎస్సీ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. ఈ క్రమంలో జిల్లాలో 190 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి దక్కే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు.

కబ్జా చెరలో వక్ఫ్ భూమి

రూ. 7కోట్లు విలువైన 14 గుంటల భూమి అన్యాక్రాంతం

అక్రమ నిర్మాణాలకు పంచాయతీ అనుమతులు

మున్సిపాలిటీలో విలీనమైనా ఆగని అక్రమ నిర్మాణాలు

వంద గజాలకు పరిమితమైన దర్గా

నోరుమెదపని అధికారులు.. స్పందించని హైడ్రా



వక్ఫ్ భూమిలో నిర్మిస్తున్న భవనం



పటేల్‌గూడలో చుట్టూ భూమి ఆక్రమణకు గురవడంతో వంద గజాలకు పరిమితమైన దర్గా

అమీన్‌పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడ గ్రామంలో సర్వే నంబర్ 228, 229లోని వక్ఫ్‌బోర్డుకు చెందిన కోట్లాది రూపాయల విలువైన భూమి కబ్జాకు గురైంది. రాజకీయ నాయకుల అండతో ల్యాండ్ మాఫియా 14 గుంటల స్థలాన్ని ఆక్రమించి, అందులో అక్రమ నిర్మాణాలను చేపట్టింది. ఒకప్పుడు విశాలమైన స్థలంలో ఉన్న దర్గా ఇప్పుడు 100 గజాలకు మాత్రమే పరిమితమైంది.

స్థలాలకు డిమాండ్

పటేల్‌గూడలో గజం రూ. 60 వేలు పలుకుతున్నది. దీంతో వక్ఫ్ భూమిపై అక్రమార్కుల కన్నుపడింది. దశాబ్దాలుగా దర్గా అదీనంలో ఉన్న స్థలాన్ని నకిలీ డాక్యుమెంట్లు చూపిస్తూ కొందరు ఆక్రమిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ ఆస్తిగా పేర్కొన్న స్థలం రాత్రికిరాత్రి ప్రైవేటు ప్రాపర్టీగా మారిపోయింది. దర్గాకు వంద గజాల స్థలాన్ని వదిలి చుట్టూ నిర్మాణాలు ప్రారంభించారు. ఇందుకు అప్పటి పంచాయతీ అధికారులు, పాలకవర్గం ఇష్టారాజ్యంగా అనుమతులు జారీ చేశారు. గత సంవత్సరం పటేల్ గూడా గ్రామ పంచాయతీని అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. అయినా నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. పంచాయతీల పాలకవర్గం పదవీకాలం ముగిసిన తర్వాత కూడా పాత అనుమతులతో నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

ఆలస్యంగా స్పందించిన అధికారులు

వక్ఫ్‌బోర్డు స్థలం కబ్జాకు గురవుతోందని తెలిసినా అడ్డుకునేందుకు ప్రభుత్వ శాఖలు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. వక్ఫ్‌బోర్డు

మిగతా 8వ పేజీలో

జిన్నారంలో సివిల్ కోర్టు ప్రారంభం

హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు



జిన్నారంలో సివిల్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

జిన్నారం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టును ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు సూరేపల్లి నంద, అనిల్ కుమార్ జూకంటి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర హాజరై న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. ప్రస్తుతం కోర్టును తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేశామని, త్వరలో శాశ్వత భవనాన్ని నిర్మిస్తామని న్యాయమూర్తులు తెలిపారు. జిన్నారం సివిల్ కోర్టు పరిధిలోకి హత్నూర, గుమ్మడిదల, బొల్లారం, జిన్నారం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కేసుల విచారణ జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ న్యాయస్థానాల న్యాయాధికారులు, జిల్లా బార్ కౌన్సిల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నర్సాపూర్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు, తహసీల్దార్ దేవదాస్ పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు

గుమ్మడిదల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): : బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయాన్ని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు సురపల్లి నంద, జె.అనిల్‌కుమార్ సందర్శించారు. గర్భగుడిలో స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్‌గుప్తా వారిని సత్కరించారు. జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర పాల్గొన్నారు.



జహీరాబాద్ డిపో సిబ్బందితో ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలి

ఆర్టీసీ ఎండీ సజ్జనార్

జహీరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సిబ్బందికి పిలుపునిచ్చారు. జహీరాబాద్ ఆర్టీసీ డిపోను ఆదివారం రాత్రి ఆయన సందర్శించారు. డీఎం స్వామి తేజావత్‌ను అడిగి డిపోకు వచ్చే ఆదాయం, బస్సుల వివరాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఆర్టీసీని అభివృద్ధిబాటలో నడిపించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఇసుక అక్రమ రవాణా లారీ సీజ్

పటాన్‌చెరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న ఒక లారీని పటాన్‌చెరు పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం బ్యాతోల్ గ్రామం నుంచి తక్కువ ధరకు ఫిల్టర్ ఇసుకను కొనుగోలు చేసి, పటాన్‌చెరు మండలం ముత్తంగి ఔటర్‌రింగ్ రోడ్ మీదుగా యాదాద్రి జిల్లాకు తరలిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ముత్తంగి ఔటర్ వంతెన కింద ఆగి ఉన్న లారీని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ అక్బర్ ఖాన్ తనిఖీ చేశారు. డ్రైవర్ శేఖర్ వద్ద సరైన రసీదులు లేకపోవడంతో లారీని సీజ్ చేశారు. ఏఎస్ఐ అక్బర్ ఖాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం రావడం లేదని
యువకుడి ఆత్మహత్య



బాణాల రఘు(ఫైల్)

బెజ్జంకి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రావడం లేదనే మనోవేదనతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. స్థానికుల వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికి చెందిన బాణాల రఘు (22) పదో తరగతి పూర్తి చేసి 2024లో హైదరాబాద్‌లో ఐటీఐ పూర్తి చేశాడు. అప్పటి నుంచి ఉద్యోగాల కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో నిరాశకు గురయ్యాడు. ఈ నెల 21న తన వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ రఘు ఆదివారం మృతి చెందాడు. రఘు తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు.

మహిళ అదృశ్యం



చింతల కవిత(ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామంలో ఒక మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ నారాయణగౌడ్ వెల్లడించిన వివరాల ప్రకారం... మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామానికి చెందిన చింతల కవిత (45) ఈ నెల 21న చందాపూర్ గ్రామంలో ఉన్న తన చెల్లెలి ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కవిత అన్న గణేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కవిత ఆచూకీ తెలిసిన వారు 8712657937 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

డంపింగ్‌యార్డ్‌తో తంటాలు

- బుస్సాపూర్ శివారులో ఏర్పాటు
- దుర్గంధంతో పరిసర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు
- కలుషితమవుతున్న చెరువులు.. కుంటల నీరు



బుస్సాపూర్ శివారులో ఏర్పాటుచేసిన చెత్త డంపింగ్‌యార్డు

తొగుట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాల ప్రజలు దుర్గంధం నడుమ జీవనం కొనసాగిస్తున్నారు. డంపింగ్‌యార్డ్ మీదుగా వచ్చే గాలులతో సతమతమవుతున్నారు. కలుషిత నీరు పొలాల్లోకి, చెరువులు.. కుంట్లోకి చేరి పశువులు, చేపలు మృత్యువాత పడుతున్నాయి. సిద్దిపేట మండలం బుస్సాపూర్ శివారులోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ (353)లోని 10 ఎకరాల్లో 2012లో చెత్త డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. అప్పట్లోనే తొగుట మండల ప్రజలు డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. చెత్త రీసైక్లింగ్ చేస్తామని, దీంతో ఎలాంటి ఇబ్బంది ఉండదని నమ్మబలికిన అధికారులు ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధి, పట్టణంలో సేకరించిన చెత్తను వాహనాల్లో తరలించి, ఇక్కడ డంప్ చేస్తున్నారు. ఆ తర్వాత చెత్త రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసి. బయోగ్యాస్.. బయో ఎరువుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ప్లాంట్‌లో కొంత వరకే చెత్తను రీసైక్లింగ్ చేస్తూ మిగితా చెత్తను కాల్చి వేయడంతో దుర్వాసన వెదజల్లి శ్యాసకోశ వ్యాధులు వస్తున్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. డంపింగ్ యార్డును తొగుట మండలం గుడికందుల రెవెన్యూ శివారు పరిధి సమీపంలో నిర్మించడంతో వర్ధరాజ్‌పల్లి, గోవర్ధనగిరి, గుడికందుల గ్రామాలతో పాటు బుస్సాపూర్ గ్రామ ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. డంపింగ్ యార్డు నుంచి వచ్చే రసాయనాలు కలుషితమై పంట భూములు విషతుల్యంగా మారడంతోపాటు పశువులు, మేకలు, గొర్రెలు మృత్యువాత పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వర్ధరాజ్‌పల్లి చెరువులో చనిపోయిన చేపలు

దమ్మాయిచెరువులో చేపలు మృతి

డంపింగ్ యార్డులో నుంచి వెదజల్లే రసాయనాల ద్వారా మండలంలోని వర్ధరాజ్‌పల్లి, గుడికందుల, గోవర్ధనగిరి గ్రామాల్లోని గుట్టకాడికుంట, దమ్మాయిచెరువు, కసాయికుంట, పిండెచెరువు, పెద్దచెరువులలోని నీరు కలుషితమవుతున్నాయి. ఇటీవల దమ్మాయిచెరువులో ఐదు క్వింటాళ్ల వరకు చేపలు చనిపోయాయి. దాంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పంట భూములు కలుషితం



డంపుయార్డ్ నుంచి వచ్చే రసాయనాల వల్ల మా పంట భూములు కలుషితమవుతున్నాయి. చెత్తకు నిప్పుపెట్టడం వల్ల వచ్చే పొగతో దుర్గంధం వెదజల్లి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించాలి.

- వంగాల మహిపాల్‌రెడ్డి, రైతు, వర్ధరాజ్‌పల్లి

ఉపాధి కోల్పోతున్నాం



చెరువులే మాకు జీవనాధారం. దానిలో పెంచే చేపలతోనే మాకు ఉపాధి లభిస్తుంది. డంపు యార్డు నుంచి వచ్చే రసాయనాల వల్ల చెరువులు కలుషితమై చేపలు చనిపోతున్నాయి. దాంతో వేము ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది. మాకు న్యాయం చేసి ఉపాధి కోల్పోకుండా చూడాలి.

-ఉప్పరి స్వామి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, వర్ధరాజ్‌పల్లి

ఏఐసీసీ ఇన్‌చార్జికి ఘన స్వాగతం




బెజ్జంకి క్రాసింగ్ వద్ద స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో చేపట్టిన జనహిత పాదయాత్రకు వెళ్తున్న ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఘన స్వాగతం పలికారు. బెజ్జంకి క్రాసింగ్ వద్ద రాజీవ్ రహదారిపై వేచి ఉన్న నాయకులు, పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బైర సంతోష్, చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, గూడెల్లి శ్రీకాంత్, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బాలుడికి కడుపు వాపు



శివ్వంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తాగునీటిలో ఎలుక పడి చనిపోయిన నీటిని అంగన్‌వాడీ చిన్నారులు తాగిన ఘటనలో ఒక బాలుడికి కడుపులో వాపు వచ్చిన సంఘటన ఆదివారం రత్నాపూర్ గ్రామంలో జరిగింది. మండల పరిధిలోని రత్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎనిమిది మంది విద్యార్థులు ఎలుక పడిన నీటిని తాగారు. అందులో దొడ్లే ఋషివర్ధన్ (4) అనే బాలుడికి ఆదివారం కడుపు ఉబ్బి, వాపు వచ్చింది. వెంటనే కుటుంబసభ్యులు అతన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన పరీక్షల కోసం బాలుడిని మెదక్‌కు తరలించినట్లు సమాచారం.






గణపతి పూజకు సిద్ధం

గణపతి పూజకు వేళయింది. రెండురోజుల్లో గణనాధుడు మండపాల్లో కొలువుదీరేందుకు రెడీ అవుతున్నాడు. ఇందుకోసం సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు రెడీ అవుతున్నాయి. వివిధ ఆకారాల్లో తయారుచేసిన వినాయక విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉంచారు. కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా



గోమయ గణపయ్య

వినాయకచవితిని పురస్కరించుకుని సిద్దిపేటలోని ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోమయ గణపయ్యలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఆవుపేడ, కలకత్తా మట్టి, చింత గింజల పొడితో పర్యావరణ హితంగా వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటితో పాటు జ్యోతులు, ప్రమిదలు, ధూప్ స్టిక్‌లు, అమ్మవారి ప్రతిమలను కూడా ఉచితంగా అందిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.



- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

విభిన్న రూపాయ.. విఘ్నేశ్వరాయ..

● మెదక్‌లో గణపతుల తయారీ ● చిన్నా.. పెద్ద విగ్రహాలు ఇక్కడే

మెదక్, కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే చాలు చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా.. ఎలాంటి గణపతులు తీసుకురావాలి, ఎత్తు ఎంత ఉండాలి, అందరికంటే మన గణపతి భిన్నంగా ఉండాలి, మండపాల డెకరేషన్ అందంగా ఉండాలి ఇలా ముందు నుంచే ప్రణాళికలు వేస్తుంటారు. ఎవరి ఇష్టం మేరకు భారీ, విభిన్నమైన గణనాయకులను మండపాల్లో ప్రతిష్ఠించి, తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. అయితే, జిల్లాలో ప్రతిష్ఠించేందుకు విభిన్న రూపాల విఘ్ననాయకుల విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. భక్తి భావంతో విగ్రహాల తయారీలో కళాకారులు శ్రమిస్తున్నారు. ఇందులో కొన్ని అరచేతిలో పట్టేంత చిన్నవిగా ఉంటే.. మరికొన్ని 21 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉంటాయి.


వివిధ రూపాలలో తయారు చేసిన గణపతులు

గతంలో గణపతుల విగ్రహాలను కొనుగోలు చేయాలంటే హైదరాబాద్‌లోని ధూల్‌పేటతోపాటు ఇతర ప్రాంతాలకు, కోరుట్ల లాంటి ప్రాంతాలకు వెళ్లేవారు. అయితే, ఇప్పుడు మెదక్ జిల్లా కేంద్రంలోని అవుసులపల్లి పరిధిలోని శిల్పా కళా ఆర్ట్ ఆధ్వర్యంలో అరచేతిలో పట్టే సైజ్ నుంచి నుంచి 21 అడుగుల వరకు గణపతులు తయారు చేసి ఇస్తున్నారు. మండప నిర్వహకుల అభిరుచికి అనుగుణంగా, విభిన్న రకాలుగా వినాయక విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి మండప నిర్వహకులు, సభ్యులు వచ్చి గణేష్ ప్రతిమలు కొనుగోలు చేస్తున్నారు. మండప నిర్వహకులు విగ్రహాలు కొనేందుకు రావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.


అడుగుల గణపతి

తక్కువ ధరకే అందిస్తున్నాం: లక్ష్మణ్‌చారి



సుదూర ప్రాంతాలకు వెళ్లి గణపతులు తెచ్చుకోవడం కంటే మా దగ్గర అన్ని రకాల మోడల్స్ గణపతులు తయారు చేస్తున్నాం. ఇతర దుకాణాలతో పోలిస్తే మా శిల్పాకళా ఆర్ట్స్ వద్ద తక్కువ ధరల్లో వినాయక ప్రతిమలు అందిస్తున్నాం. ఇక్కడే తయారు చేయడం వల్ల తక్కువ ధరకు అందించడం సాధ్యమవుతుంది.

మట్టి వినాయకుడిని పూజిస్తే భక్తి

● మట్టి వినాయకుల పంపిణీలో హరీశ్‌రావు


మట్టి వినాయక ప్రతిమ పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకులను పూజిస్తే భక్తి, ముక్తి కలుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం వద్ద అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కితాబిచ్చారు. మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తే మనకు భక్తి ముక్తి లభిస్తుందన్నారు. గతంలో గ్రామాల్లో కుల మతాలకతీతంగా ఐక్యంగా ఉండేందుకు ఒక్క వినాయకుడినే పెట్టి పూజించేవారని గుర్తుచేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల జల కాలుష్యం జరుగుతుందన్నారు. సిద్దిపేట పట్టణంలో తాను మొక్కలను నాటితే కొందరు నరుకుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి శాశ్వత భవన నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభం చేసుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

● ఎమ్మెల్యే సునీతారెడ్డి
● యూరియా కోసం రహదారిపై ధర్నా

శివ్వంపేట/సిద్దిపేట రూరల్/నంగునూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. రైతులకు సరిపడా యూరియాను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు మొదటగా యూరియా కొరత లేదని చెప్పినప్పటికీ.. ప్రస్తుతం పొలాల్లో కలుపుతీసే సమయంలో యూరియా కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో యూరియా కోసం రైతులు సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డుపై ఆదివారం రాస్తారోకో చేశారు. సరైన సమయానికి పంటకు యూరియా అందించకపోతే పంట దిగుబడి ఎలా వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో యూరియా సరఫరా చేసినా ఒక్క బస్తా దొరకడం లేదని వాపోతున్నారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారి నరేష్, రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ రాజేష్ రైతులకు సర్ది చెప్పి రాస్తారోకో విరమింపజేశారు. అలాగే నంగునూరు మండలంలోని పాలమాకుల, రాంపూర్, మగ్దుంపూర్, ముండ్రాయి, ఓబులాపూర్, బద్దిపడగ, నర్మెట్ట, వెంకటాపూర్ తదితర గ్రామాల రైతులు యూరియా కోసం బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతువేదిక వద్ద టోకెన్లు ఇస్తే, సహకార సంఘం వద్ద యూరియా బస్తాలు అందజేశారు. పాలమాకుల గ్రామంలో పోలీస్ పహారాలో అధికారులు యూరియా పంపిణీ చేశారు.


యూరియా కొరతను నిరసిస్తూ శివ్వంపేటలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డుపై రాఘవాపూర్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

అధికారపక్షం ఇవ్వదు.. ప్రతిపక్షం నోరెత్తదు

● రేవంత్‌రెడ్డితో తాడో పేడో తేల్చుకుందాం
● తమ ఉద్యమం అధికారపక్షానికి ఉరితాడుగా మారబోతుంది
● ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

జహీరాబాద్/జోగిపేట రూరల్/నర్సాపూర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాల అసమర్థత వల్లే అధికార పక్షం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, అధికార పక్షం ఇవ్వదు.. ప్రతిపక్షం నోరెత్తదు అని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, నర్సాపూర్, అందోల్‌లలో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో నేడు పేదలు సమస్యల్లో కూరుకుపోయారన్నారు. నాటి వైఎస్ నుంచి నేటి రేవంత్ రెడ్డి వరకు తాము నిరుపేదల కోసం పోరాటాలు.. ఉద్యమాలు చేసి అండగా నిలుస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హామీలు అమలవుతుంటే తెలంగాణలో ఎందుకు అమలుకావడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ ఏనాడు కులం కోసం పోరాటాలు చేయలేదని మాదిగల రిజర్వేషన్ల కోసం పోరాటం చేసిందన్నారు. సమస్యల సాధన కోసం తాము చేపట్టే ఉద్యమం అధికారపక్షానికి ఉరితాడుగా మారబోతుందని, సీఎం రేవంత్‌రెడ్డితో తాడో,పేడో తేల్చుకుందామని మందకృష్ణ స్పష్టం చేశారు. వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్లు, పెన్షన్ల పెంపు విషయంలో ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందన్నారు.

శ్రమను గౌరవిస్తేనే దేశాభివృద్ధి : రాఘవులు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రమను గౌరవించే సంస్కృతి ఉన్న దేశాలు మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షికోత్సవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ప్రైవేట్ పరిశ్రమలో ఒకే నాయకత్వంలో 40 ఏళ్లపాటు యూనియన్‌ను నడిపించడం అభినందనీయమన్నారు. కేవలం తమ జీతభత్యాల కోసమే కాకుండా సామాజిక కార్యక్రమాలలో సైతం చురుకుగా పాల్గొంటూ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. దేశ జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు ఉత్పత్తిలో భాగస్వాములైతేనే నిజమైన అభివృద్ధి సాధించినట్లు అవుతుందన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు గమనిస్తే ముఖ్యంగా అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇటీవల అడ్డగోలుగా పెంచిన పన్ను టారీఫ్ ద్వారా ఎగుమతులపై ఆధారపడిన పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఉన్న సౌకర్యాలను నిలబెట్టుకోవడమే కష్టమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక పోరులో మనమే గెలవాలి

● శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

రామాయంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక పోరులో బీఆర్ఎస్ గెలువాలని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసుధనాచారి అన్నారు. ఆదివారం ఆయన నిజామాబాద్ వెళ్తున్న సమయంలో రామాయంపేట బైపాస్ రోడ్డు వద్ద కొద్దిసేపు ఆగారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు అక్కడికి చేరుకొని మధుసూదనాచారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. కార్యకర్తలు ఎన్నికలకు సమాయాత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, హుస్నుద్దీన్ రాజు, యాదగిరి, ఆమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సిదిపేట కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో తొగుట మండలం గుడికందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలవడంతో అప్పటి స్మృతులను గుర్తు చేసుకుని మురిసిపోయారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించాలి

● ప్రొఫెసర్ కోదండరాం
● అన్నివర్గాలను చైతన్య పరిచేది ఉపాధ్యాయుడే: ప్రొఫెసర్ కాశీం
● విద్యతోనే సమసమాజ అభివృద్ధి : విమలక్క



విద్యాసదస్సులో మాట్లాడుతున్న కోదండరాం, విమలక్క

గజ్వేల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనను అందించాలని జేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో ఉపాధ్యాయుడు పంబాల ఎల్లయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యాసదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయులంతా బాధ్యతతో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించాలని కోరారు. ప్రభుత్వాలు సైతం అంతే బాధ్యతగా పాఠశాల విద్య బలోపేతానికి నిధులను సమకూర్చాలన్నారు. టీపీటీఎఫ్ కార్యకర్తలంతా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. అనంతరం డాక్టర్ అనిత మాట్లాడుతూ మహిళలు ఉద్యమకాలంలో రచయితలుగా రాణించారన్నారు. ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఉపాధ్యాయుడు కొన్ని విలువలు కలిగి ఉండాలని, ఉపాధ్యాయులు మాత్రమే సమాజంలోని అన్నివర్గాలను చైతన్యపరుచగలరని తెలిపారు. సీబీఎస్సీ, ఐసీఎస్సీ పాఠ్యాంశాల మాదిరిగా తెలంగాణ పాఠ్యాంశాలను రూపొందించాలని చెప్పారు. ప్రస్తుత సమాజంలో విద్య పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా సాగుతుందన్నారు. సమాజంలోని పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమై కూలీలుగా, చిన్న చిన్న పనులు చేసుకుంటూ దుర్భరమైన జీవితం గడుపుతున్నారని, దీంతో సమాజంలో రోజురోజుకు పేదవారి సంఖ్య పెరిగిపోతూ.. వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని చెప్పారు. విద్యతోనే సమసమాజ అభివృద్ధి జరుగుతుందని, ఉపాధ్యాయులు విద్యతో పాటు విలువలను, ప్రశ్నించేతత్వాన్ని విద్యార్థులకు, సమాజానికి నేర్పాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. ఈ సదస్సులో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, టీపీటీఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు లక్ష్మయ్యయాదవ్, దామోర రాజయ్య, రాంచంద్రం, రాజులు, పాపిరెడ్డి, మంజుల, నేతి శంకర్, నర్సింలు, మహేందర్ గౌడ్, ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మండపాలకు ఉచిత విద్యుత్

నారాయణఖేడ్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గణేశ్, దేవీ నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా విగ్రహాల కోసం ఏర్పాటు చేసే మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్టు ఖేడ్ ఏడీఈ నాగిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎస్‌పీడీసీఎల్ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 6 వరకు 11 రోజులపాటు గణేష్ మండపాలకు, సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వరకు దేవీనవరాత్రుల సందర్భంగా మండపాలకు ఉచిత విద్యుత్ పొందవచ్చన్నారు.

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర లీగల్ సెల్ కో కన్వీనర్‌గా రవిశంకర్



నియామకపత్రం అందుకుంటున్న రవిశంకర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర లీగల్ కో కన్వీనర్‌గా సంగారెడ్డి అధ్యక్షుడు రవిశంకర్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం చైర్మన్ మోత్కురి రామ్మోహన్ శర్మ, ప్రధాన కార్యదర్శి వైద్య ప్రభాకర్ శర్మ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. సంఘం బలోపేతానికి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవిశంకర్ తెలిపారు.

డిగ్రీలో గ్రూప్ మార్చుకునేందుకు నేడు చివరి అవకాశం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : డిగ్రీలో దోస్త్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులు గ్రూపు మార్చుకునేందుకు ఈ నెల 25న చివరి అవకాశం కల్పించినట్టు తారా కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. ఏ కళాశాలలోనైతే అడ్మిషన్ పొందారో అదే కళాశాలలో ప్రస్తుతం ఉన్న గ్రూపు నుంచి మరో గ్రూపునకు మార్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రంలోపు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 9441069020 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజలకు అండగా ఉంటా..



బాధితుడికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సదాశివపేట మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన బాధితుడు అల్మాన్ సరిహాకు మెరుగైన వైద్యం నిమిత్తం రూ. 2 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో సదాశివపేట మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, శ్రీహరి, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకుడు

చిన్నశంకరంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం ప్యాటగడ్డ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త తల్లి మరణించడంతో ఆదివారం బీజేపీ జిల్లా నాయకుడు లింగం గౌడ్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సురేష్‌గౌడ్, ప్రవీన్‌గౌడ్, బాబు, శ్రీనివాస్, మహేష్, శేఖర్, దశరథం పాల్గొన్నారు.

అంత్యక్రియలకు...

టేక్మాల్ ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడ్మాట్‌పల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కంకర బీరప్ప భార్య విట్టమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న రాజనర్సింహ ఫౌండేషన్ చైర్‌పర్సన్ త్రిష రాజనర్సింహ రూ. 15వేలను అంత్యక్రియల నిమిత్తం అందజేశారు. అదేవిధంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పు శంకరప్ప రూ.11వేలను మృతురాలి కుటుంబానికి అందజేశారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి

పటాన్‌చెరు ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సీఐ విజయకృష్ణ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం భానూరులో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు విషయంలో మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని సూచించారు.

స్థలం కేటాయించారు.. నిధులు మరిచారు

- గత ప్రభుత్వంలో నర్సాపూర్‌లో మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయానికి స్థలం కేటాయింపు
- సొంతభవనం నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు అంచనా!
- నేటికీ నిధులు మంజూరు చేయక వృథాగా మారిన స్థలం
- అద్దె భవనంలో అరకొర సౌకర్యాల మధ్య నెట్టుకొస్తున్న విద్యార్థులు





మైనార్టీ రెసిడెన్షియల్‌కు కేటాయించిన స్థలం, ప్రస్తుతం కొనసాగుతున్న అద్దెభవనం ఇదే

నర్సాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయానికి స్థలం కేటాయించి ఏళ్లు గడిచినా నేటికీ నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ స్థలం వృథాగా మారింది. అంతేకాకుండా అద్దె భవనంలో అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

అద్దెభవనంలో అవస్థలు..

నర్సాపూర్‌లో మైనార్టీ రెసిడెన్షియల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి నర్సాపూర్-హైదరాబాద్ మార్గంలోని ఓ అద్దె భవనంలో మూడంతస్తుల భవనంలో కొనసాగుతుంది. ఈ విద్యాలయంలో పాఠశాల, కళాశాల కలిపి 400 మంది విద్యార్థులు ఉంటున్నారు. అయితే వీరికి సరిపోయేవిధంగా గదులు లేక ఇరుకైన గదుల్లోనే నెట్టుకొస్తున్నారు. క్రీడామైదానం సౌకర్యం లేదు. భోజనాలకు, స్నానాలకు, టాయిలెట్లకు కిందకు దిగి రావాల్సిందే. ప్రతీ అవసరానికి మెట్లు ఎక్కి దిగాల్సి రావడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

రూ. 20 కోట్ల అంచనా!

నర్సాపూర్-సంగారెడ్డి మార్గంలో తుల్జారాంపేటకు వెళ్లే దారిలో 3.20ఎకరాల ప్రభుత్వ భూమిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే కేటాయించి బోర్డు కూడా ఏర్పాటు చేసినా ఆ ప్రభుత్వంలో అదిగో.. ఇదిగో అంటూ నెట్టుకొచ్చారే తప్ప నిధులు మాత్రం విడుదల చేయలేదు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏర్పడి దాదాపు ఏడాదిన్నర కాలం గడిచినా నేటికీ సొంత భవన నిర్మాణానికి నిధుల విషయం ప్రస్తావన ఊసే లేదు. సొంత భవన నిర్మాణానికి సుమారు రూ.20కోట్ల వరకు అవసరమని అధికారుల అంచనా. అయితే ఆ నిధులు ఎప్పుడు వస్తాయో.. సొంత భవనం నిర్మాణం అయి తమ సమస్యలు ఎప్పుడు తీరుతాయో అని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.



అద్దె భవనంలో కుళాయి వద్ద గుమిగూడిన విద్యార్థులు

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్,ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. వినతుల పై తక్షణం స్పందిస్తూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు, ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరిరి సమస్యలను తీర్చడానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్, కాంగ్రెస్ నేతల బొజ్జ పవన్, ఉప్పల రాజేశ్, శ్రీనివాస్ చౌదరి, మాజీ కౌన్సిలర్లు,వివిధ మండలాల నాయకులు,ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కాంగ్రెస్‌తోనే పేదల కల సాకారం

హవేళిఘణపూర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే పేదప్రజల కల సాకారం అవుతుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాజిపేట తండాలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తండాలో జరుపుకుంటున్న తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని సేవాలాల్, జగదంబమాతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యువజక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరశురాంగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మసీద్ నిర్వహణ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించడం సరికాదు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మసీద్ పరిరక్షణ కమిటీ బాధ్యులు

నారాయణఖేడ్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ హష్మీమసీదు ప్రత్యక్ష నిర్వహణ బాధ్యతలను వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు కల్పిస్తు ఉత్తర్వు ఇవ్వడం సరికాదని మసీదు ముత్తవలి డాక్టర్ అబ్దుల్ మజీద్, సబ్ ముత్తవలి మొహిద్‌ఖాన్ తోపాటు ముస్లిం పెద్దలు ముంతాజ్, తౌసిఫ్, జకిరియాఖురేషి, మీర్ ఆంజద్ అలీ, సికిందర్ అలీ, మీర్‌సాజీద్ అలీ, ఖదీర్, ఫయాజ్, ఖతీబ్, ఆజీమ్ తదితరులు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మసీదుకు 90 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. భూములను అన్యాక్రాంతం చేసేందుకు ఈ ప్రాంతంతో ఎలాంటి సంబంధం లేనివారు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మసీదు భూములు, ఆస్తులపై కోర్టు ఇది వరకే ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా మసీదు నిర్వహణ, ఆస్తులపై జోక్యం తగదన్నారు. మసీదు భూములను కాపాడాలని కోరుతూ ఈ మేరకు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్‌లకు వినతి పత్రం అందజేశారు. కాగా నిజాంపేట మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీలోని 30 కుటుంబాల నుంచి 100 మంది కార్యకర్తలు ఆదివారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో మాజీ వార్డు సభ్యులు రమేష్, నాయకులు సంజీవులు, బాలయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాధిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి



ఆసుపత్రిలో చిన్నారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శివ్వంపేట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎలుక పడ్డ నీటిని సేవించి అస్వస్థతకు గురై నర్సాపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. ఆదివారం నర్సాపూర్ ఆసుపత్రిలో పలువురు అంగన్‌వాడీ చిన్నారులు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సందర్శించి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడుతూ పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు పూర్తిస్థాయిలో వైద్యం అందించాలన్నారు. పిల్లల ఆరోగ్యం గురించి డాక్టర్‌ను ఆరా తీయగా ప్రమాదం ఏమి లేదని ముందుజాగ్రత్త చర్యలో భాగంగా పర్యవేక్షణలో ఉంచినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట శివ్వంపేట మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీ కో ఆప్షన్ మన్సూర్, మండలపార్టీ అధ్యక్షులు శేఖర్, రమణగౌడ్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, పట్టణ పార్టీ అధ్యక్షులు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కూడా ఆసుపత్రిలో ఉన్న చిన్నారులను పరామర్శించి సీడీపీవోతో మాట్లాడారు.

అనుమతి మేరకే పనులు చేపట్టాం

కల్హేర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకారశాఖ అధికారి అనుమతి మేరకే క్రిష్ణాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రహరీ నిర్మాణ పనులను చేపడుతున్నట్టు పీఏసీఎస్ చైర్మన్ క్రిష్ణాగౌడ్, వైస్ చైర్మన్ రాంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము పాలకవర్గం తీర్మానం మేరకే పనులు నిర్వహిస్తుంటే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అధికారులకు పిర్యాదు చేసి పనులు ఆపివేయించడం సరికాదన్నారు. సహకార భవనం చుట్టూ ఉన్న సంఘం స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని కబ్జా చేస్తున్నారనే ఉద్దేశంతోనే ప్రహరీ నిర్మాణం చేపడుతున్నామని, ఇందులో నిధుల దుర్వినియోగానికి పాల్పడటం లేదని వారు వివరించారు.

ఏఎస్‌హెచ్‌ఎంల జిల్లా సంఘం కార్యవర్గం



పాశం వెంకటేశం, అధ్యక్షుడు

మెదక్ అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. పీఎస్ హెచ్ఎం జిల్లా అధ్యక్షుడిగా పాశం వెంకటేశం, ప్రధానకార్యదర్శిగా లక్ష్మణ్, వీరెందర్, కోశాధికారిగా సుంకూరి వెంకటేశం, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, ప్రమోద్, రవీందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా దుర్గయ్య, నాగభూషణం, శివశంకర్, జిల్లా కార్యదర్శిగా పోచయ్య, సాయిశిరి, మహిళా ఉపాధ్యక్షులుగా సావిత్రి, సాంస్కృతిక కార్యదర్శి గణేష్ బాబు, అంబికా సోని, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు

పటాన్‌చెరు ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధి సింఫనీపార్క్ హోమ్స్ కాలనీలో ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు స్థలాన్వేషణ చేశారు. కాలనీవాసులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం తరపు నుంచి ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు సత్తిరాజు, ఉపాధ్యక్షుడు లింగరాజు, ప్రధాన కార్యదర్శి ధర్మానంద్, సత్యారావు, అశోక్ తెలిపారు.



కాలనీవాసులతో సమావేశమై మెట్టుకుమార్‌యాదవ్

వైభవంగా శ్రావణ ఉత్సవాల ముగింపు



కోహీర్ మండలం బడంపేట రాచన్నస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు, గుమ్మడిదల మండలం వీరభద్రస్వామి ఆలయం నుంచి లక్ష బిల్వార్చన పత్రిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

కోహీర్, ఆగస్టు 24: (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బడంపేటలో గల శ్రీరాచన్న స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా గత నెల రోజుల పాటు జరిగిన లక్ష బిల్వార్చన ఆదివారంతో ముగిసింది. ముగింపు వేడుకల్లో భాగంగా స్వామివారికి, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకము అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం శ్రావణ మాసం ముగింపు రోజు కావడం వల్ల ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. అనంతరం అమృత గుండంలో బిల్వపత్రాన్ని శ్రీశైల దేవస్థానంలో గల పాతాళ గంగలో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● **గుమ్మడిదల:** గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామంలో ప్రాచీన శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష బిల్వార్చన పత్రీ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం ఆరంభం నుంచి నేటివరకు ఆలయంలో లక్ష బిల్వార్చన పత్రీ పూజా కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, కార్యనిర్వహణ అధికారి శశిధర్ గుప్త ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో వీరన్న చెరువులో బిల్వార్చన చేసిన బిల్వపత్రాలను ఘనంగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ సురభి నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

తుజాల్‌పూర్‌లో ఘనంగా తెప్పోత్సవం

● **నర్సాపూర్:** ఇటీవల వర్షాలు చెరువులు, కుంటలు నిండటంతో రైతులలో ఎక్కడ లేని ఆనందం వ్యక్తం అవుతుంది. నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన దామరచెరువు నిండి అలుగుపారుతుండటంతో స్థానిక రైతులు ఆనందంతో తమకు ఇక పంటలకు డోకా లేదని సంబురపడుతూ ఘనంగా తెప్పోత్సవం నిర్వహించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు గాలి లక్ష్మీనారాయణ, మాజీ ఉపసర్పంచ్ శ్రీరామ్‌యాదయ్య, మాజీ వార్డుసభ్యులు రాజు, ఆంజనేయులు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్: తుజాల్‌పూర్‌లో చెరువు వద్ద తెప్పోత్సవం

మెరుగైన వైద్య సేవలు అందించాలి: మెదక్ కలెక్టర్



పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న రాహుల్ రాజ్

చిన్నశంకరంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, మెడిసిన్ స్టోర్ రూమ్, ఓపీ రూమ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు ఆరోగ్య చిట్కాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందితో ఆసుపత్రి స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కేజీబీవీని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుడిగా మారి పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించి పలు ప్రశ్నలను అడిగి జవాబులను రాబట్టారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. విద్యా బోధనపై పలు అంశాలను వివరించారు. అనంతరం వంట గదిని సందర్శించి వంటల నాణ్యతను పరిశీలించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సంగారెడ్డిలో ఉత్సాహంగా 5 కే రన్



సంగారెడ్డిలో 5 కే రన్‌లో పాల్గొన్న డీవైఎస్‌వో, యువత

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి రోజున నిర్వహించే నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం 5 కే రన్ నిర్వహించారు. సంగారెడ్డిలోని ఐబీ నుంచి అంబేడ్కర్ స్టేడియం వరకు రన్ ఉత్సాహంగా సాగింది. సుమారు 300మందికిపైగా విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు, స్పోర్ట్స్ అసోసియేషన్స్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో ఖాసీంబేగ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, డీవైఎస్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి విమర్శించారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన జిల్లా 5వ మహాసభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం ఐసీడీఎస్‌తో పాటు విద్యావిధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకుండా, కేంద్ర ప్రభుత్వ సిఫారసులను అమలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాలను వెనక్కి తీసుకుని ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. రిటైర్డ్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఖర్చులకు రూ.50 వేలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించి అర్హులైన ఆయాలను టీచర్స్‌గా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల హక్కుల కోసం సమరశీల పోరాటాలు నిర్వహించనున్నట్టు జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మంగ, శశికళ, నాయకులు అరుణ, విజయ, ఇందిర, యేసుమని, కవిత, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యోధుడికి కన్నీటి వీడ్కోలు



మజ్జిగ ఈశ్వరయ్య అంతిమయాత్రలో నాయకులు

అల్లాదుర్గం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మజ్జిగ ఈశ్వరయ్య(96) అంత్య క్రియలు ఆదివారం నిర్వహించగా పలువురు పాల్గొని కన్నీటితో వీడ్కోలు పలికారు. అల్లాదుర్గంకు చెందిన ఈశ్వరయ్య కొంత కాలంగా అనారోగ్యానికి గురై శనివారం సాయంత్రం తన ఇంట్లోనే తుది శ్వాస వదిలారు. దేశ స్వాతంత్రం కోసం ఉద్యమించి ప్రజలను చైతన్యపరుస్తూ కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలోని కారాగారంలో జైలు శిక్ష అనుభవించిన వారిలో ఈశ్వరయ్య ఒకరని పలువురు గుర్తు చేసుకున్నారు. దక్షిణమధ్య రైల్వే బోర్డు కమిటీ సభ్యుడు కాశీనాథ్, వీరశైవ లింగాయత్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి కొంక రాజేశ్వర్‌తో పాటు ఆయా పార్టీలకు చెందిన నాయకులు ఈశ్వరయ్యకు ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజాహిత కార్యక్రమాలే తెనా లక్ష్యం

రామచంద్రాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాహిత కార్యక్రమాలతో ప్రజలకు లబ్ధి చేరుకూర్చడమే తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ (తెనా) లక్ష్యమని తెనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. ఆదివారం కొల్లూరు డబల్ బెడ్‌రూం గృహ సముదాయాల్లో తెనా, తెల్లాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. జాబ్ మేళాలో 1500 మందికి పైగా నిరుద్యోగులు పాల్గొనగా 300 మంది ఉద్యోగులుగా నియామకమైనట్టు తెలిపారు. సిటిజన్స్ హాస్పిటల్, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టేవారికి మున్సిపల్ అధికారుల పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో తెనా, లయన్స్ క్లబ్ సభ్యులు రవి కిరణ్, సుభాష్, రవీందర్, సాయికిరణ్ ఉన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్‌లో అకౌంటెంట్లను నియమించాలి

కల్హేర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో తొలగించబడిన సమగ్ర శిక్షా అభియాన్ అకౌంటెంట్స్‌ను తిరిగి నియమించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్షా అభియాన్ మండల అకౌంటెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు మ్యాస సదర్శన్ గౌడ్ కోరారు. ఈ మేరకు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్‌కు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2011 సంవత్సరంలో 1,537 మందిని మండలస్థాయిలో అకౌంటెంట్స్‌గా నియమించారని, అనివార్య కారణాల వలన తమను విధుల నుంచి తొలిగించారని వినతి పత్రంలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2016లో హైకోర్టు ఆదేశాల మేరకు 2018 లో ఏపీ రాష్ట్రం మండల అకౌంటెంట్స్‌ను తిరిగి నియమించిందని తెలిపారు. కానీ నేటికీ తెలంగాణాలో మాత్రం తమను విధుల్లోకి తీసుకోలేదని వివరించారు.

కబ్జా చెరలో వక్ఫ్ భూమి

(5వ పేజీ తరువాయి)

అధికారులు దర్గాను సందర్శించి స్థలం కబ్జాకు గురవుతున్నట్లు గుర్తించి రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపణలున్నాయి. దీనిపై స్థానికులు హైడ్రాకు కూడా ఫిర్యాదు చేశారు. ఆరోపణలు వెలువెత్తడంతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఇటీవల అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలు ప్రారంభించినప్పుడు స్పందించకుండా ఇప్పుడు నోటీసులతోనే సరిపెడతారా అంటూ గ్రామస్థులు, ముస్లిం సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఇచ్చిన అనుమతులను చూసి ఇళ్లను కొనుగోలు చేసిన అమాయకులు ఇప్పుడు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు ఎప్పుడు కూల్చివేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, ఇళ్లను నిర్మించి సొమ్ము చేసుకున్న అక్రమార్కులు మాత్రం ఎక్కడా కనిపించకుండా పోయారు.